# అభిమానం

వి. సుందరి

అనూరాధను పదకొండో ఏట దసరా శెలవులకు పెత్తల్లి గారింటికి వాళ్ళమ్మ పంపడమే ఒకవిధంగా ఆపిల్ల మనస్తత్వం మారడానికి కారణమయింది. అంతవరకు స్కూల్లో చాలామంది పిల్లలు ఆమెకన్నా ఖరీదైన గుడ్డలు వేసుకుని వచ్చేవారు. ఆ వూరిలోనే చదువుకుంటూన్న పెత్తల్లి కొడుకు అప్పుడప్పుడు ఇంటికి వచ్చినప్పుడు ఆమెతండ్రికన్నా మంచి బట్టలు వేసుకుని వచ్చేవాడు. ఆమెకు, తమ్ముడికి ఏవేవో కొనితెచ్చేవాడు. అయితే అప్పుడంతా ఆమె మనస్సుకు ఏమీ తోచేదికాదు. కాని ఆమె వెలిసిపోయి అక్కడక్కడ చిరుగులు మాసికలతో వున్న పరికిణీలు చొక్కాలు వేసుకోవడం పెత్తల్లి గారి అమ్మాయిలు మంచిమంచి పువ్వుల పరికిణీలు అవీ ధరించడం; వాళ్లకు బోలెడు నగలు పట్టుబట్టలువుండడం, ఆమెకుమాత్రం ఒక్కటే ఒక్క మంచిపరికిణీ వుండడం, ఇలాటివన్నీ గమనించింది. దాంతోటి ఆమె మనస్సుకు ఆందోళన కలిగింది. ఇంతే కాదు. పెత్తల్లిగారింట్లో వంటకు, మిగతా పనులకు పనిమనుష్యులున్నారు. వాళ్ల ఇంట్లో అమ్మే వంట చెయ్యాలి. అనూరాధ అమ్మకు ఎంతో సహాయం చెయ్యాలి. అమ్మ పనిగావుంటే తమ్ముణ్ణి ఆమే ఆడించాలి. బజారుకువెళ్లి సామాన్లుకూడా తెస్తుంది అప్పుడప్పుడు. మరి ఇక్కడ పెత్తల్లిగారి అమ్మాయిలకు పనేలేదు. ఎప్పుడూ ఆటపాటలతో గడిచిపోతుంది. పెత్తల్లి భర్త, పెద్ద ఆఫీసరూ, బాగా డబ్బుగలవాడనీ, తన తండ్రి నూరురూపాయిల జీతంతో సంసారం ఈదాలనీ ఇంత ఆలోచన చేయలేకపోయింది ఆమె. కాకపోగా, ఈవైభోగమంతా వాళ్లకు వుండడమూ, తమకు లేకపోవడం, దీనిలో పెత్తల్లిదేదో తప్పుగా తోచింది. అంతే, దానితో ద్వేషం అంకురించింది.

పండగకు తన పిల్లలతోపాటు అనూరాధకుకూడా కొత్త పరికిణీ, చొక్కా కుట్టించింది పెత్తల్లి. కాని అవి వేసుకుందుకు ఆమెకు మనస్కరించలేదు. అందులో తనకేదో పెద్ద అవమానమనిపించింది. అయితే తనకు వేరే మంచిబట్టలు లేకపోవడంచేత అవి వేసుకోక తప్పలేదు. దానితో తన అశక్తత తలచుకుని వుడుకుమోత్తనం జాస్తీ అయింది. ఈవిధంగా అన్నిట్లోను 'అవమానం' అన్న ఒక్క భావమే వెతుకుతూ దసరాశెలవులంతా వ్యథతోను, వుక్రోషంతోనూ గడిపి శెలవులాఖరుకాకముందే 'అమ్మను చూడాలని వుం'దని మారాంచేసి ఇంటికి వచ్చేసింది. అప్పటినుంచీ పెత్తల్లికొడుకు ఇంటికివస్తే అంత సరదాగా మాట్లాడేది కాదు. అతను ఏదైనా తెచ్చిఇచ్చినా, తప్పుగానే కనపడేది. తీసుకునేది కాదుకదా తనతమ్ముడు ఇసంతా తెలియక తీసుకుంటే వాణ్ణి కోప్పడేది. ఆపై దసరాశెలవులకుమళ్ళీ తనను పంపమని పెత్తల్లికోరినా తను వెళ్లలేదు.

కాలక్రమేణ ఆమె వయస్సుతోపాటు ఈ ద్వేషంకూడా పెరిగి, "నిజంగా వాళ్లు మనల్ని అవమానంచేస్తున్నారా? లేక మనమే వాళ్ల సదభిప్రాయాన్ని తప్పుగా తీసుకున్నామా? ఈ తారతమ్యానికి వాళ్లెలాగ బాధ్యులు?" అనే వివక్షణాజ్ఞానానికి చోటివ్వకుండా చేసింది. అమ్మవ్వాళ్ల నాన్నకు చాలా జబ్బుచేసి సంసారం గడవడంకూడా కష్టంగావున్నప్పుడు పెత్తల్లి డబ్బు పంపిస్తే అది తీసుకున్నందుకు తన తల్లిని తూలనాడింది. 'నాకు వుంది. మీకు లేదు'అని చూపేందుకు గర్వానికి ఈవిధంగా సహాయంచేస్తున్నట్లు నటిస్తుంది పెత్తల్లి, అని చీదరించుకుంది. ఇట్టి అపోహ తగదని వాళ్లమ్మ ఎంత నచ్చచెప్పచూచినా ఆమెకు ఆగ్రహం హెచ్చిందేకాని వేరేలాభం లేకపోయింది.

తన పెండ్లికి పెత్తల్లివస్తే ఆమెతో ముక్తసరిగా ఏవో నాలుగు మాటలు మాట్లాడి ఊరుకోవాలనుకుంది. అయితే పెండ్లికానుకగా ఆమెతెచ్చిన బంగారుగొలుసు చూడగానే తలకొట్టేసినంతఅవమానమనిపించింది. ఏమంటే తండ్రి తనకుతెచ్చిన సంబంధం తమతాహతుకు తగినదేకాని, పెద్ద డబున్నవాళ్లు కారు. తన అత్తింటివాళ్ళు, పుట్టింటివాళ్ళుకూడా పెట్టలేని నగ తన పెత్తల్లి ఇచ్చి, 'అందరిలోను ఇదిగో చూచారా నాగొప్ప' అని చాటుకుంటున్నదని అక్కసువపడి క్రుంగిపోయింది. దాంతో ఆనగ వేసుకోనూలేదు, ఇంక పెత్తల్లితో మాట్లాడనూలేదు.

భర్త సంపాదన తక్కువే అయినా, పొదుపుగా సంసారంచేస్తూ, నేర్పుగా ఇల్లు సరిదిద్దుకుంటూ భర్త ఆదరాన్ని మెప్పును పొందింది. ఆమె అదృష్టమే కావచ్చు. భర్త కృషిఫలితమే కావచ్చు. అతనికి త్వరలోనే ప్రమోషనై ఆమెకు మంచిరోజులు వచ్చినాయి. ఆమె కిప్పుడు అష్టైశ్వర్యాలు లేకపోయినా రోజులు హాయిగా గడుస్తున్నాయి.

ఇంతలో అనూరాధ తండ్రి హఠాత్తుగా కాలంచేశాడు. తమ్ముడు గుమాస్తా గిరీకి అప్లికేషను దాఖలు చేస్తానన్నాడు. తనకిది ఎంతమాత్రమూ ఇష్టంలేదు. తనకు బిడ్డా, పాపలేరు. భగవంతు డింత ఇచ్చాడు. తమ్ముణ్ణి తాను పెద్ద చదువు చదివించి, గొప్ప ఉద్యోగవంతుడయేట్లు చూస్తానంది. తమ్ముడు మండిపడ్డాడు. "నీకీనాడు దశ వచ్చింది. మేము తక్కువస్థితిలో వున్నామని మమ్మల్ని అవమానం చేస్తావా? నీముష్టి మాకక్కర్లేద"ని ఛీత్కరించాడు. అనూరాధ నిశ్చేష్టురాలైంది. తల్లితో తమ్ముడు తననీవిధంగా అపార్థం చేసుకున్నాడని చెప్పి ఏడ్చింది.

"అవును. నీకు తమ్ముడువాడు. నువ్వు మీ పెత్తల్లిచేసిందంతా అపార్థం చేసుకోలేదా? నాకష్టం చూడలేక అది సహాయం చెయ్యబోతే అభిమానంతో నువ్వు ఆగ్రహపడలేదా! ఇప్పుడు నీవు సద్బుద్ధితో చెయ్యబోయినా నీతమ్ముడు అదే అభిమానంతో అపార్థం చేసుకున్నాడు. నేనేంచేసేది" అంది తల్లి. కోపంతోను, దుఃఖంతోను, ఇంటికి వెళ్ళిపోయింది అనూరాధ. కాని రోజురోజు ఈ సంఘటన ఆలోచించగా తనతప్పు తనకు స్పష్టమైంది. ఇన్నాళ్ళకు బుద్ధి వికసించి ద్వేషాన్ని మాపుకోగలిగింది.

ఆనాడు విజయదశమి. దాదాపు పదిహేనేళ్ళతర్వాత అకస్మాత్తుగా అనూరాధ పెత్తల్లిగారింటికి వెళ్ళింది. పెండ్లిలో పెత్తల్లిఇచ్చిన నగ, ఆమె మెడలో ఆరోజు క్రొత్తవెలుగులు మెరిపిస్తోంది. తలవనితలంపుగా లోపలికివస్తూన్న అనూరాధను చూచి, పలకరించేందుకైనా నోటమాట రాలేదు ఆ పెత్తల్లికి. దగ్గరికి వచ్చి నమస్కరించబోతూన్న అనూరాధనుమాత్రం హృదయానికి హత్తుకుంది. ★